

ఆప్యాయతానురాగాల రాఖీ బంధం..

వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తు చేసే మధుర బంధమే రక్షాబంధన్.

- 8లో



కుష్టు రోగులకు ప్రత్యక్ష నరకం..

కుష్టు రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. వారి సంక్షేమాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో వారు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు.

- 8లో

సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాస్తవ

పార్వతీపురం టౌన్: పార్వతీపురం సబ్ కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాస్తవను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీడీఏ పీఓగా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటి వరకు ఆయన కొవ్వూరు సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఇంతవరకు ఐటీడీఏ పీఓగా విధులు నిర్వహించిన సేతు మాధవన్ విజయనగరం బదిలీపై వెళ్లారు.

న్యూస్‌రీల్

ఆలయ అభివృద్ధికి కృషి

- తోటపల్లిని దర్శించిన కలెక్టర్



స్వామి వారి పూజల్లో పాల్గొన్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన గరుగుబిల్లి మండలంలోని తోటపల్లి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయ సిబ్బంది కలెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వీవీ అప్పలాచార్యులు కలెక్టర్‌తో పూజా కార్యక్రమం నిర్వహించి వేదాశీర్వచనం చేశారు. అలాగే స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని కలెక్టర్‌కు ఈఓ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆలయం పూర్వ వైభవానికి తన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓ బి.శ్రీనివాసరావు, ట్రస్ట్ బోర్డు సభ్యుడు డి.ధనుంజయరావు, జట్టు ట్రస్ట్ డి.పారినాయుడు, సభ్యులు పకీరునాయుడు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నందివానివలసలో ఏనుగులు



తోటల్లో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి పంచాయతీ నందివానివలస గ్రామంలో పంటపొలాలు, తోటలలో ఆదివారం ఏనుగులు గుంపు సంచరిస్తోంది. వారం రోజుల క్రితం నందివానివలస పరిసరాల్లో సంచరించిన ఏనుగులు తరువాత జియ్యమ్మవలస పరిసరాల్లో తిరుగాడి మళ్లీ నందివానివలసకు చేరుకున్నాయి. ప్రస్తుతం గ్రామంలో వరి, బీర, పామాయిల్ తదితర పంటలు ఉండడంతో వాటిని నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగులు సంచరిస్తుండడంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు భీతిల్లుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సర్వత్రా ఆందోళన చెందుతున్నారు. ఏనుగులను ఈ తంనుంచి తరలించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సింగనాపురంలో..

జియ్యమ్మవలస: మండలంలోని సింగనాపురం పంట పొలాల్లో ఆదివారం ఏనుగులు దర్శనమిచ్చాయి. వరి ఉబాలు పూర్తికావడం, అరటి పంట దశలో ఉండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి సమయాన గ్రామాలలోకి ఏనుగులు వచ్చే ఆవకాశముందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

గంజాయి నిర్మూలనపై డీఐజీ సమీక్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో గంజాయి నిర్మూలనకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుకు విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదివారం విశాఖ రేంజ్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకూ రేంజ్ పరిధిలో ఉన్న ఎస్పీలు గంజాయి నియంత్రణకు చేపట్టిన చర్యలు, పురోగతి, పరిణామాలు, భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. గంజాయి అక్రమ రవాణాకు వినియోగిస్తున్న అన్ని మార్గాలపై నిఘా కొనసాగించాలని, కీలక నేరస్తులపై అనుమానిత షీట్లు తెరవాలని ఆదేశించారు. ఈ ఏడాదిలో రూ.4.75 కోట్ల విలువ చేసే 9517 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 545 మందిపై 223 కేసులు నమోదుచేశామని డీఐజీ ఈ సందర్భంగా తెలిపారు. గంజాయి రవాణాకు సహకరించిన వారిని ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చి, అరెస్టు చేయాలని ఎస్పీలను ఆదేశించారు. సమావేశంలో విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్, అనకాపల్లి ఎస్పీ ఎం.దీపిక, శ్రీకాకుళం ఎస్పీ మహేశ్వరరెడ్డి, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, అల్లూరి సీతారామరాజు ఎస్పీ అమిత్ బర్దర్, ఎన్‌డీపీఎస్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

తాడు ఉడుపు పద్ధతిలో నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు



భళిరా.. భళి బెంగాలీ కూలీ..!



పొలం గట్టుపైనే వంట చేసుకుని భోజనాలు చేస్తున్న వలస కూలీలు

- తాడు ఉడుపులో గుర్తింపు
- రైతులకు తగ్గుతున్న భారం
- పెరుగుతున్న దిగుబడి

మానిందే మందు..బతికిందే ఊరు అన్న నమ్మకంతో రాష్ట్రాలు దాటి వచ్చిన బెంగాలీ కూలీలు కష్టపడి పనిచేసి సంపాదించుకోవడమే కాకుండా మంచి పనితనంతో భళా అనిపించుకుంటున్నారు. వరినారు తీయడం, మోయడం, నాట్లు వేయడంలో వారికి వారే సాటి. వారికి పని అప్పగిస్తే మూడువంతుల ఖర్చు తగ్గడంతో పాటు సమయం కూడా కలిసివస్తోందని జిల్లా రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భామిని: తక్కువ సమయంలో తక్కువ మందితో తక్కువ నారుతో వేగంగా నాట్లు వేయడం బెంగాలీ కూలీల ప్రత్యేకత. దీని వల్ల నారుమడికి విత్తనాల వినియోగం, పెట్టుబడి ఖర్చు తగ్గుతోంది. ఫలితంగా రైతులు బెంగాలీ కూలీలతో నాట్లు వేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. వరినారు తీయడం, మోయడం, నాట్లు వేయడం అంతా బెంగాలీ కూలీల బృందమే చూసుకుంటుంది. దీంతో రైతుకు ఖర్చులు కలిసి వస్తున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని మండలంలో వ్యవసాయ బోర్లు, నీటి వసతి ఉన్న పంట పొలాల్లో బెంగాలీ కూలీలే నాట్లు వేశారు. ప్రస్తుతం వర్షాలు జోరందుకోవడంతో వర్షాధార పొలాల్లోనూ ఖరీఫ్ వరినాట్లు వేగవంతంగా తాడు ఉడుపు పద్ధతిలో వేయిస్తున్నారు. తాడు ఉడుపుతో దూర దూరంగా నాట్లు పడడంతో తెగుళ్ల బెడద ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పంట దిగుబడి కూడా బాగా వస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బెంగాలీ కూలీల ప్రత్యేకత

పశ్చిమ బెంగాల్ నుంచి ముందస్తుగా రాష్ట్రంలోని గోదావరి జిల్లాల్లో బెంగాలీ కూలీలు ప్రవేశించారు. అలా జిల్లాలు దాటుకుంటూ ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లాలో అడుగుపెట్టారు. వారంతా జట్టుగా వచ్చి స్థానిక పెద్ద రైతులు ఏర్పాటు చేసిన తాత్కాలిక స్థావరాల్లో నివాసం ఉంటున్నారు.

తాడుకొలత ఉడుపు బెంగాలీల ప్రత్యేకత. మగకూలీలే వరినాట్లు వేయడం ఆకర్షణీయం. పొలం వద్ద బెంగాలీ కూలీలు వంటవార్పు చేసుకుంటూ గట్లుపైనే భోజనాలు కానిస్తుండడం చూపరులకు ఆసక్తి కలిగిస్తోంది. ఎక్కడ పొలం ఉంటే అక్కడికే గ్యాస్‌పొయ్యి, వంటపాత్రలు, నీళ్ల పట్టుకుని వెళ్లి వంట చేసుకుని తింటూ వరినాట్లు వేయడం వారి ప్రత్యేకత. వారు నాట్లు వేసే వేగం మరింతగా ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం జిల్లా నుంచి వంశధార ఆవల గల ఒడిశా గ్రామాల్లో బెంగాలీ ఉడుపుల బృందానికి డిమాండ్ పెరిగింది.

తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు వరినాట్లు వేయడంలో వీరు నిష్ణాతులు. పొలాల కొలతల్లో తేడా వస్తే ఆండ్రాయిడ్ ఫోన్‌లో జీపీఎస్‌తో కొలతలు తీసి విస్తీర్ణం లెక్కిస్తున్నారు. కచ్చితంగా కూలి డబ్బులు తీసుకుంటారు.

లేత నారుతో నాట్లు

రైతులు గతంలో ఎకరాకి 25 కిలోల వరి విత్తనాలు ఉపయోగించే వారు. ప్రస్తుతం బెంగాలీ కూలీల రాకతో 10 కిలోల వరి విత్తనాలు నారు పోస్తున్నారు. స్థానిక కూలీలు ముప్పై రోజుల వయస్సు గల నారుతో మాత్రమే నాట్లు వేస్తే..వీరు 15 నుంచి 20 రోజుల వయస్సు గల వరినారుతోనే నాట్లు వేయగలరు. లేత నారు నాటితే నాలుగైదు రోజుల్లో మొనలు తిరిగి వేర్లు పాకుతాయని చెబుతున్నారు. ముదురు నారుతో నాట్లు వేస్తే మొనలు పెరగడానికి 10 రోజులు పడుతుంది. వారు ఎకరాకి 10 నుంచి 15 కట్టలతో నాట్లు వేస్తారు. కూలీలు తగ్గుతారు.పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది.

మూడొంతుల ఖర్చు తక్కువ



బెంగాలీ కూలీలు నాట్లు వేయడంతో ఖర్చు తగ్గుతోంది. నారు తీత, మోత, నాట్లు వేయడం కలిసివస్తోంది. వరినారు వేయడానికి విత్తనాల ఖర్చు మిగులుతోంది. పని వేగవంతంగా సాగుతోంది. పొలం వద్దే వంటా వార్పు చేసుకోవడం వల్ల వేగంగా నాట్ల పనులు పూర్తి చేస్తున్నారు.

శివ్వాల తిరుపతిరావు, రైతు, గురండి, భామిని మండలం

తాడు ఉడుపుతో పంట దిగుబడి



వలస కూలీలు చేస్తున్న తాడు ఉడుపు విధానం పంటకు అనుకూలం. లేలేత వరినారు వేయడం, వరుస క్రమంలో నాటడం, మొనల మధ్య సమాన దూరం ఉండడంతో పంటకు అనుకూలంగా ఉంటుంది. గాలి వెలుతురు తగులుతుంది.అధిక దిగుబడికి ఆవకాశాలు పెరుగుతున్నాయి. తక్కువ నారు ఉపయోగిస్తుండడంతో విత్తనాల వ్యయం తగ్గుతుంది. శాస్త్రీయంగా నాట్లు విధానం సక్రమైనదే.

కొర్ను సింహాచలం, ఎంఏఓ, భామిని

పొలం పనిలో పెద్ద సారు..!



పొలంలో దిగి ఉబాలు వేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

- రైతులతో కలిసి ఉబాలు వేసిన కలెక్టర్
- సేంద్రియ ఎరువు తయారీలో సహాయం
- గుమ్మలక్ష్మీపురంలో పర్యటన

గుమ్మలక్ష్మీపురం: ఫుల్‌హ్యాండ్ షర్ట్ చేతులు మడత పెట్టి, ప్యాంట్‌ను మోకాలి వరకు మడిచి రైతులతో కలిసి పొలంలోకి దిగి ఉబాలు వేశారు వ్యవసాయం పట్ల ఆసక్తి గల కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్. అలాగే జీవామృతం వంటి ప్రకృతి ఎరువుల తయారీలోనూ రైతులతో కలిసి చేయి కలిపారు. తమతో కలిసి కలెక్టర్ ఉబాలు వేయడం, ఎరువు తయారీలో పాల్గొనడం పట్ల రైతులు సంతోషం వెలిబుచ్చారు. శతశాతం ప్రకృతి వ్యవసాయ గ్రామాలైన గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొరడ, రాయగడ జమ్ము గ్రామాలతో పాటు కురుపాం మండలంలోని కొండబారిడి, వసలబల్లేరు గ్రామాల్లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ఆయా గ్రామస్తులు గిరిజన సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులను కలెక్టర్ అడిగి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న తీరు, కలుగుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా మార్కెటింగ్ అందించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని అవకాశాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో రోజువారీ పోకడలను తెలుసుకోవాలని, తదనుగుణంగా కార్యక్రమాలు చేపట్టవచ్చని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు అన్ని విధాలా సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమేనని స్పష్టం చేశారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు లక్ష్యంగా నిర్ణయించామని, సుమారు 49వేల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ఆ సంఖ్యను 75వేలకు పెంచేందుకు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. సహజ వ్యవసాయం వల్ల పంటలకు అదనపు విలువ పెరుగుతుందని, సహజ వ్యవసాయ ఉత్పత్తులకు ప్రజలు మంచి ప్రాధాన్యం ఇస్తున్నారని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో జట్టు ట్రస్టీ డి.పారినాయుడు, ఏపీ సీఎస్ఎఫ్ జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు, ఎంపీడీఓ జి.రమేష్ బాబు, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఐలకు బదిలీ

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం సోషల్ మీడియా సైబర్‌సెల్ సీఐ టీవీ.విజయకుమార్‌ను అనకాపల్లి టౌన్‌కు, బొబ్బిలి టౌన్‌లో పనిచేస్తున్న ఎం.నాగేశ్వరరావును వీఆర్‌కు, ఆయన స్థానంలో రుషికొండ మెరైన్ సీఐగా పనిచేస్తున్న కటకం సతీష్ కుమార్‌ను బదిలీ చేశారు. అలాగే విజయనగరం రూరల్ సీఐగా పనిచేస్తున్న ముదిలి శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి సర్కిల్‌కు, ఆయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా డీటీసీలో పనిచేస్తున్న గుంట్రెడ్డి అశోక్‌కుమార్‌ను బదిలీ చేశారు. పార్వతీపురం టౌన్‌లో పనిచేస్తున్న పీవీఎస్ఎన్.కృష్ణారావును వీఆర్‌కు, అల్లూరి జిల్లా డీజీఆర్‌బీ సీఐగా పనిచేస్తున్న వి.నారాయణరావును పార్వతీపురం టౌన్‌కు బదిలీచేశారు. భోగాపురంలో పనిచేస్తున్న అడబాల రవికుమార్‌ను విజయనగరం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, వీఆర్‌లో ఉన్న ఎన్వీ.ప్రభాకరరావును భోగాపురానికి బదిలీ చేశారు. విజయనగరం టాస్క్‌ఫోర్స్ సెల్ సీఐగా పనిచేస్తున్న కె.అశోక్ కుమార్‌ను రాజాం టౌన్‌కు, అక్కడ పనిచేస్తున్న దాడి మోహనరావును కాశీబుగ్గ బదిలీ చేశారు. విజయనగరం డీఎస్‌బీ–2లో పనిచేస్తున్న ఈ.నరసింహమూర్తిని ఉమెన్ పీఎస్‌కు, అక్కడ పనిచేస్తున్న బి.నాగేశ్వరరావును వీఆర్‌కు, డీటీసీ సీఐగా ఉన్న ఏవీ.లీలారావును డీఎస్‌బీ–2కు బదిలీచేశారు. వీఆర్–1లో ఉన్న బి.లలితను డీటీసీ విజయనగరానికి బదిలీ చేశారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధం

- నేడు రక్షా బంధన్
- జోరుగా రాఖీల విక్రయం



పట్టణంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న రాఖీలు

పార్వతీపురం: అన్నా చెల్లెళ్లు..అక్కా, తమ్ముళ్ల మధ్య ఆత్మీయ బంధానికి చిహ్నంగా నిర్వహించుకునే పండగ రక్షాబంధన్. రక్త సంబంధీకులు లేకున్నా..మన కోసం అండగా నిలిచే ఆప్తుల్ని సమాజం అందిస్తుంది. అలాంటి వారికి రాఖీ కట్టి సోదర భావాన్ని పెంపొందించుకోవడానికి రాఖీ పౌర్ణమి మంచి సందర్భం. సోదరుడంటే తోడ బుట్టిన వాడే కానక్కర్లేదు. చెల్లెమ్మా..నేనున్నానంటూ రక్షగా నిలిచే ప్రతి ఒక్కరూ సోదర సమానులే. అందుకే వారి అనుబంధానికి ప్రతీకగా శ్రావణమాసంలో పౌర్ణమినాడు రక్షాబంధన్ (రాఖీ) పండగ జరుపుకుంటారు.

'జోరందుకున్న అమ్మకాలు

సోమవారం రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో రాఖీ విక్రయాలు జోరందుకున్నాయి. విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులు, చూడగానే ఆకట్టుకుంటున్న మోడల్స్‌లో రాఖీలు యువతను కనువిందు చేస్తున్నాయి.

'ఆన్‌లైన్‌లోనూ విస్తృతంగా అమ్మకాలు

దుకాణాల్లోనే కాకుండా ఆన్‌లైన్‌లోనూ రాఖీల అమ్మకాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వివిధ వెబ్‌సైట్లలో రాఖీలకు సంబంధించి అనేక మోడళ్లు అందుబాటులో ఉన్నాయి.

మధుర జ్ఞాపకం..!

కరిగిపోయే కాలంలో..చెరిగిపోని మధుర స్మృతులకు ప్రతిబింబాలే ఫొటోలు. ఎన్నో భావాలు, మరెన్నో జ్ఞాపకాలను మళ్లీ మళ్లీ తనివితీరా వీక్షించే అవకాశాన్ని ఇచ్చిన తీపి గుర్తులు ఫొటోలే. ప్రతి ఫొటో వెనుక ఓ జ్ఞాపకం..ఓ కథ..ఓ అనుభూతి దాగి ఉంటుంది. నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కెమెరా కంటికి చిక్కిన దృశ్యాలు..

\- డి.సత్యనారాయణమూర్తి,
సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



ప్రతిబింబం



గంగిరెద్దుతో వస్తున్నట్లు..



అయ్యకోనేరులో రంగురంగుల కొంగలు

కురిసింది వాన..



పార్వతీపురం పట్టణ ప్రధాన రహదారిపై చేరిన వర్షపునీరు

జిల్లాలో వర్షపాతం నమోదు (మిల్లీమీటర్లో)		
మండలం	శుక్రవారం	శనివారం
వీరఘట్టం	0.0	15.4
సీతంపేట	23.6	11.4
భామిని	15.8	7.2
పాలకొండ	47.0	4.6
కొమరాడ	20.6	83.2
గుమ్మలక్ష్మీపురం	2.4	28.8
కురుపాం	0.8	38.6
జియ్యమ్మవలస	6.4	20.8
గరుగుబిల్లి	18.4	5.2
పార్వతీపురం	22.8	42.4
మక్కువ	20.0	0.0
సీతానగరం	11.2	0.0
బలిజిపేట	1.4	8.2
సాలూరు	18.4	0.0
పాచిపెంట	346.4	0.0

- పార్వతీపురంలో కుండపోత
- ప్రధాన రహదారితో పాటు పలు ప్రాంతాలు జలమయం



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపు నీరు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. పార్వతీపురం పట్టణం, కురుపాం, కొమరాడ, జియమ్మవలస మండలంలో శనివారం రాత్రి మూడు గంటలపాటు అతి భారీవర్షం కురవడం విశేషం. వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, బలిజిపేట, భామిని, మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పార్వతీపురం పట్టణం, వీరఘట్టంలో అధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ సిబ్బంది తెలిపారు.

256.8 మి.మీ వర్షపాతం

జిల్లాలో శనివారం రాత్రి 256.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కొమరాడ మండలంలో 83.2, పార్వతీపురంలో 42.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కురిసిన రెండు రోజులు జిల్లా వ్యాప్తంగా సగటున 17.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలియజేశారు.

వసతిగృహంలోకి చేరిన వర్షపునీరు

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గెడ్డ ఉప్పొంగడంతో పార్వతీపురం పట్టణ శివారులో ఉన్న జ్యోతిబాపూలే బీసీ బాలికల సంక్షేమ వసతి గృహంలోకి వరద నీరు చొచ్చుకు వచ్చింది. దీంతో విద్యార్థులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రాకపోకలు లేకపోవడంతో నిత్యావసర సరుకులు చేరేందుకు దారి లేకపోవడంతో విద్యార్థుల భోజనాలకు ఇబ్బంది ఏర్పడింది.

అన్నదాతల హర్షం

జూన్, జూలై, ఆగస్టు నెలల్లో ముఖం చాటేసిన వరుణుడు రెండు రోజులుగా అన్నదాతలను కరుణించాడు. వర్షాలు విస్తారంగా కురవడంతో పలు ప్రాంతాల్లోని పొలాల్లో నీరు చేరింది. ఈ వర్షంతో రైతులకు ఎంతో మేలు చేకూరనుంది.



వసతి గృహంలో చేరిన వర్షపు నీరు



భామిని మండలంలోని బిల్లమడ రహదారిలో చిక్కుకున్న వాహనాలు

క్లుప్తంగా

రక్షా బంధన్ శుభాకాంక్షలు

విజయనగరం: రాఖీ పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని అక్కచెల్లెమ్మలకు ఉమ్మడి విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అ పండుగ సోదర ప్రేమను మరింత పటిష్టం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా అంతటా ఈ పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వ్యక్తిపై కత్తితో దాడి..

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి జంక్షన్‌లో ఓ వ్యక్తిపై దాడి జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ పరిధి మల్లికార్జున కాలనీకి చెందిన పడాల శేఖర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శేఖర్ భార్యకు బొబ్బిలి జంక్షన్ సమీపంలోని గొల్లవీధికి చెందిన నాగళ్ల గణేష్ తరచూ ఫోన్ చేయడంతో పాటు ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై శేఖర్ ఆదివారం రాత్రి గణేష్‌ను కలిసి ఫోన్‌లో తన భార్య ఫొటోలను డిలీట్ చేయమనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో గణేష్ తన వద్దనున్న కత్తితో శేఖర్ ఛాతిపైన, వీపుపైన పొడిచి పారిపోయాడు. వెంటనే శేఖర్ తన ఆటోలో పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని అక్కడ పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి, హుటాహుటిన రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఎస్సై వై.రవికిరణ్ ఆస్పత్రికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఉపేంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


చంటి మృతదేహం

బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస గొల్లవీధికి చెందిన గడిదేశి చంటి (20) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చంటి కాకినాడలోని ప్రతిభ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ శనివారం గ్రామానికి చేరుకున్నాడు. ఇటీవల ఇండియన్ ఆర్మీ నిర్వహించిన అగ్నివీర్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇంకా రన్నింగ్ పోటీ ఉండడంతో బొబ్బిలి పట్టణంలోని కేటీఆర్ అకాడమీలో ట్రైనింగ్ తీసుకునేందుకు స్వగ్రామానికి వచ్చాడు. రానున్న వినాయక చవితికి పందిరి కర్రల కోసం ఆదివారం తన స్నేహితులతో గ్రామానికి తూర్పువైపు ఉన్న రైల్వేట్రాక్ దాటి వెళ్లాడు. వెదురు కర్రలను కొట్టుకుని తిరిగి వస్తూ రైల్వే ట్రాక్ దాటుతుండగా... వెదుర్లు పైన ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదుకోవాల్సిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శ్రీను, రాధ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. శ్రీను, రాధ దంపతులకు ముగ్గురు కుమారులు కాగా.. చంటి చిన్నవాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భోగాపురం: శ్రీకాకుళం చిన్న బజారుకు చెందిన వద్దాది శంకర్‌గుప్తా అనే వ్యక్తిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి ఆదివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చాకివలస గ్రామానికి చెందిన పద్మజ్యోతికి 2023లో శ్రీకాకుళం చినబజార్‌కు చెందిన వద్దాది శంకర్‌గుప్తాతో వివాహం జరిగింది. వివాహ సమయంలో 17 తులాల బంగారం, రెండు కేజీల వెండితో పాటు ఆరు లక్షల రూపాయల నగదు కట్నకానుకల కింద అందజేశారు. సంవత్సరం పాటు వీరి దాంపత్య జీవితం సవ్యంగా సాగింది. ఇటీవల కాలంలో కారు కొనుగోలుకు రూ. పది లక్షలు తీసుకురావాలని గుప్తా తన భార్య పద్మజ్యోతిని వేధించసాగాడు. డబ్బులు తీసుకురాకపోవడంతో ఆమెను కన్నవారింట వదిలేసి వెళ్లిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పాలకొండ రూరల్ : మండలంలోని అట్టలి సమీపంలో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ మండలం పొట్లి గ్రామానికి చెందిన అదపాక గోవింద్ (22) ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్ది నెలలుగా భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలతో ఇటీవలే భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన గోవింద్ అట్టలి సమీపంలోని మామిడితోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎన్. ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మృతదేహానికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹216

ఆప్యాయతానురాగాల రాఖీ బంధం..



- నేడు రాఖీ పౌర్ణమి


పాలకొండ జగన్నాథస్వామి ఆలయ సమీపంలో ఆకట్టుకుంటున్న రాఖీ పుష్పాలు


రాఖీలు కొనుగోలు చేస్తున్న అమ్మాయిలు

పాలకొండ రూరల్: వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తు చేసే మధుర బంధమే రక్షాబంధన్. సర్వకాల సర్వావస్థల యందు తనకు రక్షణగా ఉండాలనే ఉద్దేశంతో తన సోదరులకు శ్రావణ పౌర్ణమి (రాఖీ పౌర్ణమి) రోజున సోదరి రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటుంది. అన్నదమ్ముల యశస్సు, శ్రేయస్సు కోరి రాఖీ కట్టే సంప్రదాయం అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తోంది. మానవతా విలువలు మంటగలుస్తున్న ప్రస్తుత కాలంలో రాఖీ పండగ తన ప్రాముఖ్యతను చాటుకుంటోంది. రక్తం పంచుకుని పుట్టిన అన్నాచెల్లెళ్లే కాకుండా ఏ సంబంధం లేకున్నా కుల, మతాలకతీతంగా.. ఆత్మీయుల మధ్య ఐక్యతను చాటిచెప్పేందుకు ఈ పండుగ ఓ వేదిక. రాఖీ పౌర్ణమి పండుగను సంతోషంగా నిర్వహించేందుకు అందరూ సంసిద్ధమయ్యారు. సోదరులకు రాఖీలు కట్టేందుకే ఇప్పటికే చాలా మంది సోదరీమణులు తమ పుట్టిళ్లకు చేరుకున్నారు. విద్యార్థినీ, విద్యార్థులు.. యువతీ, యవకులు మధ్య సోదరభావం పెంపొందించేందుకు కొన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఈ వేడుకలను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు.

మహాలక్ష్మిగా భావించి..

ఆడపడుచులను తమ ఇంటి మహాలక్ష్మిగా, పరాశక్తి ప్రతీకకగా భావించే గొప్ప సంస్కృతి మనది. అక్కాచెల్లెళ్లకు అన్ని సమయాల్లో, కష్ట సుఖాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించేందకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడకలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు అన్నివర్గాల వారు సిద్ధమయ్యారు.

మార్కెట్‌లో సందడే.. సందడి..

రక్షాబంధన్ వేడుకల్లో కీలకమైన రాఖీలు వివిధ రకాల ఆకృతుల్లో దర్శనమిస్తున్నాయి. విరివిగా రాఖీల విక్రయ స్టాల్స్ జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. రాఖీల అమ్మకాలు, కొనుగోళ్లతో మార్కెట్ కళకళలాడింది. స్థానిక వ్యాపారులు గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా ప్రాంతాల నుంచి వివిధ రకాల ఆకర్షణీయమైన రాఖీలను తీసుకువచ్చి హోల్‌సేల్ ధరలకు అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ఏడాది ఆకర్షణీయమైన బాక్స్ రాఖీలు, రంగు పూసలతో కూడిన, చేనేత కళాకారులు రూపొందించిన రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. జ్యూయలరీ షాపుల్లో వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే గిఫ్ట్ షాపులు, స్వీట్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

హోరా.. హోరీ..

- రెండో రోజు కొనసాగిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు
- నేడు విజేతలకు బహుమతుల ప్రదానం


రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి సీనియర్స్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు హోరా.. హోరీగా సాగుతున్నాయి. నగరంలోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరగనున్న పోటీలు ఆదివారం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. సీనియర్స్ విభాగంలో పురుషుల సింగిల్స్, డబుల్స్ పోటీలతో పాటు మహిళల సింగిల్స్, డబుల్స్ పోటీలు జరిగాయి. అంతేకాకుండా మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. ఆదివారం సాయంత్రానికి ఐదు విభాగాల్లో క్వార్టర్ ఫైనల్స్ దశ ముగియగా... సోమవారం సెమీఫైనల్స్, ఫైనల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు సోమవారం సాయంత్రం ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. అదేవిధంగా రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను వచ్చే నెల 8 నుంచి 11వ తేదీ వరకు రాజమండ్రిలో జరగనున్న ఆల్ ఇండియా సౌత్ జోన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలకు.. 16 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున పంపిస్తామన్నారు. పోటీలను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.సురేష్, వై.కుసుం బచ్చన్, పొట్నూరు శ్రీరాములు, తదితరులు పర్యవేక్షించారు.

మోటార్ వాహన చట్టం ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్


తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

విజయనగరం క్రైమ్: మోటార్ వాహన చట్టం ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. పట్టణంలో ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ సీఐ సూరినాయుడు నేతృత్వంలో ఎస్సైలు శంబాన రవి, లోవరాజు, ఎ.మహేశ్వరరావు, త్రినాథరావులు బృందాలుగా ఏర్పడి పట్టణంలోని గంటస్తంభం, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడులాంతర్లు, కోట జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, దాసన్నపేట రైతుబజారు, కొత్తపేట, నీళ్ల ట్యాంకు ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపట్టారన్నారు. వాహనాలు నడిపిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సౌండ్ పొల్యూషన్, ఇర్రెగ్యులర్ నంబర్ ప్లేట్స్, నో నంబర్ ప్లేట్స్ కలిగిన 104 వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే డ్రంకన్ డ్రైవ్ చేసిన ముగ్గురికి, ఎంవీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 23 ఈ చలాన్‌లు విధించినట్లు తెలిపారు.

గంజాయితో వ్యక్తి అరెస్ట్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు (వెనుక ముసుగులో నిందితుడు)

గజపతినగరం: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, గజపతినగరం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఎస్సై యు. మహేష్, సిబ్బంది శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపడుతుండగా.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దేవేందర్ కుమార్ మంజు అనే వ్యక్తి రైల్వేస్టేషన్ నుంచి గజపతినగరం వైపు వస్తున్నాడని తెలిపారు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా, ఆయన బ్యాగులో నాలుగు కిలోల గంజాయి పట్టుబడిందని చెప్పారు. ఈ గంజాయి విజయనగరం మీదుగా గోవా తరలించనున్నట్లు నిందితుడు తెలిపాడన్నారు. ఎవరి వద్ద గంజాయి కొనుగోలు చేశాడు.. ఎవరికి తరలిస్తున్నాడు.. వంటి వివరాలపై ఆరా తీస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జీఏవీ రమణ, ఎస్సై యు.మహేష్, తదితరులు పాల్గొన్నారు.

● జాతి వైరం మరిచి..



జాతి వైరం పూర్వం నుంచి వస్తున్నదే . అయితే ఆధునిక సమాజంలో మూగజీవాలు సైతం జాతి వైరం మరిచిపోయి మానవ సమాజానికి సందేశాన్ని అందిస్తున్నాయి. ఎన్ఆర్ పురం వద్దనున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఓ కుక్క , పిల్లి జాతివైరం మరిచి, స్నేహపూర్వకంగా తిరుగుతున్నాయి.

– శృంగవరపుకోట

పక్కాగా పశుగణన

- సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31వరకు మూగజీవాల సర్వే
- ఎన్యుమరేటర్లకు డివిజన్ల వారీగా శిక్షణ పూర్తి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి మన్మథరావు

పార్వతీపురం: అఖిల భారత పశుగణనకు రంగం సిద్ధమైంది. ప్రతి ఐదేళ్లకోసారి దేశవ్యాప్తంగా యూనియన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ యానిమల్ హస్బెండ్రీ, డైరీయింగ్ అండ్ ఫిషరీస్ (డీఏహెచ్ఎఫ్) ఆధ్వర్యంలో పశువులు, కోళ్లు, కుక్కలు, కుందేళ్ల వంటి వాటిని గణించే సర్వే 2019లో జరిగింది. ప్రస్తుతం 21వ సర్వే సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఆరంభం కానుంది. 2019లో తొలిసారిగా వివరాలను వెబ్, మొబైల్ యాప్‌లో సేకరించారు. అదే విధానాన్ని ఈసారి కూడా అనుసరించనున్నారు.

బ్రిటిష్ కాలం నుంచే సర్వే..

భారతదేశంలో ఇలాంటి సర్వే బ్రిటిష్ పాలకుల హయాంలోనే 1919లో ప్రారంభమైంది. ప్రతి ఐదేళ్లకోసారి ఇప్పటి వరకు 20 సార్లు లెక్కించారు. తాజాగా లైవ్‌స్టాక్ సెన్సెస్‌ను 2024 సెప్టెంబర్ ఒకటో తేదీనుంచి దేశవ్యాప్తంగా ఆరంభించనున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావం తర్వాత 1956–57 నుంచి 12 సార్లు పశుగణన నిర్వహించారు. రాష్ట్ర విభజన తర్వాత 13 జిల్లాలతో ఏర్పడిన నూతన ఆంధ్రప్రదేశ్‌లో 2019లో తొలి పశుగణన జరిగింది. ఇప్పుడు 26 జిల్లాల్లో ఈ ప్రక్రియ చేపట్టనున్నారు.

ఆదాయ వనరులు..

వ్యవసాయం, మత్స్య, అటవీ రంగాల్లోని మొత్తం ఆదాయంలో లైవ్‌స్టాక్ ఆదాయం 25.6 శాతం ఉంటుందని అంచనా. జీడీపీలో లైవ్‌స్టాక్ సెక్టార్ భాగస్వామ్యం నాలుగు శాతానికి పైగానే ఉంటోంది. ఇంతటి కీలకమైన రంగంలో డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ అవసరమైన అభివృద్ధి చర్యలకు వీలుగా ఈ సర్వే చేపడుతున్నారు. 1971, 2002, 2019 సర్వేల్లో కొంత జాప్యం జరిగింది.

'పశుసంవర్థక శాఖకు బాధ్యతలు

గతంలో సర్వే బాధ్యతలను రెవెన్యూ శాఖ నిర్వహించేంది. పశుగణనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ప్రభుత్వం 2007లో పశుసంవర్థక శాఖకు అప్పగించింది. అప్పటినుంచి జిల్లాలో కలెక్టర్ పశుగణన అధికారిగా వ్యవహరిస్తున్నారు. డివిజన్ స్థాయిలో పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, మండలస్థాయిలో పశువైద్యాధికారి సర్వే అధికారిగా ఉంటారు. ఎన్యుమరేటర్లుగా గోపాల మిత్రలు, వెటర్నరీ పారా సిబ్బంది పశుగణనలో పాల్గొంటారు.

సాంకేతికత వినియోగం

గతంలో మాన్యువల్‌గా జరిగే ఈ ప్రక్రియలో వార్డులు, గ్రామాలు, తాలూకాల వారీగా వివరాలను సేకరించేవారు. తర్వాత వాటిని జిల్లా కేంద్రానికి, రాష్ట్ర విభాగానికి పంపేవారు. వివిధ దశల్లో వాటిని తనిఖీ చేయడం వల్ల కాలయాపన జరుగుతోందన్న భావనతో 20వ పశుగణనను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో పూర్తిగా వెబ్, మొబైల్ యాప్‌లో సేకరించారు. ఈసారి కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తారు.

జిల్లాలో పరిస్థితి ఇదీ..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 20వ సర్వే ప్రకారం ఆవు జాతి పశువులు 2,28,681, గేదె జాతి పశువులు 46,057 ఉన్నాయి. గొర్రెలు 2,07,451, మేకలు 1,73,110, పందులు 9,089, కోళ్ళు 8,46,060 ఉన్నట్లు తేలింది.

ఏయే వివరాలు సేకరిస్తారంటే..

- ఆవులు, గేదెలు, వాటి జాతులు, అభివృద్ధి, ఉత్పాదకత సహా అన్ని వివరాలను సర్వేలో పొందుపరుస్తారు.
- గొర్రెలు, మేకలు, కోళ్లు, పందులు, ఇతర పెంపుడు జంతు వుల లెక్కలూ సేకరిస్తారు. వాటి వయసు, సంబంధిత వివరాలన్నీ నమోదవుతాయి.
- ప్రతి ఇంట్లో ఉన్న వాటి వివరాలతోపాటు యజమానులు లేని పశువులు, గోశాలల్లో ఉండే వాటిని కూడా లెక్కిస్తారు.
- రైతులు వాడే యంత్ర పరికరాలు, వ్యవసాయ సామగ్రి, మత్స్యకారుల వలలు, బోట్లు సహా వివిధ వివరాలను సేకరిస్తారు.
- గ్రామాల్లోని పశువుల సంతలు, వాటికోసం ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు, పశుదాణా తయారీ కేంద్రాలు, పాలసేకరణ, శీతలీకరణ కేంద్రాలు, మాంసం దుకాణాలు, జంతువులు మార్కెటింగ్ వంటి వివరాలపై సర్వే ఉంటుంది. వాటిలో గుర్తింపు ఉన్నవి, లేనివి కూడా నమోదవుతాయి.

శిక్షణ పూర్తి



పశుగణనలో భాగంగా సిబ్బంది చేసే ఇంటింటి సర్వేతో రైతులు, వ్యవసాయ కూలీలు సామాజిక, ఆర్థిక స్థితిగతులను అంచనా వేసేందుకు వీలవుతుంది. పశుసంపద తగ్గిన చోట వాటిని పెంచేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుంది. పథకాలు, రాయితీల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయింపునకు అవకాశం ఉంటుంది. పశుగణనకు ప్రజలందరూ సహకరించాలి.

– ఎస్.మన్మథరావు, జిల్లా పశువైద్యాధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

కుష్టు రోగులకు ప్రత్యక్ష నరకం..

- ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు
- మరుగుదొడ్లు లేక తప్పని ఇబ్బందులు
- పాడైన బెడ్‌లే దిక్కు
- పట్టించుకునే నాథుడే లేడు..


పగిలిన గచ్చు


స్నానపు గది వద్ద పరిస్థితి


కుష్టు, హెచ్ఐవీ తాత్కాలిక చికిత్సా కేంద్రం


బెడ్‌షీట్స్ లేని పరుపులు


వార్డులో చికిత్స పొందుతున్న కుష్టు రోగులు

విజయనగరం ఫోర్ట్: కుష్టు రోగుల పరిస్థితి దయనీయంగా మారింది. వారి సంక్షేమాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో వారు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. తమకు ఎప్పుడు మంచి రోజులు వస్తాయా అని వారంతా ఎదురుచూస్తున్నారు. కుష్టు రోగులంటే సమాజంలో ఇప్పటికీ వివక్ష కొనసాగుతూనే ఉంది. వారి కష్టసుఖాలపై ఆరా తీసే నాథుడే లేకుండా పోయాడు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం ఎదురుగా (టీహెచ్ వార్డు) క్షయ, హెచ్ఐవీ తాత్కలిక చికిత్సా కేంద్రం ఉంది. ఇందులో 20 పడకలు ఉన్నాయి. 10 పడకలు హెచ్ఐవీ రోగులకు, 10 పడకలు కుష్టు రోగులకు కేటాయించారు. గతంలో హెచ్ఐవీ, కుష్టు రోగులు చికిత్స పొందేవారు. ప్రస్తుతం కుష్టు రోగులు మాత్రమే చికిత్స పొందుతున్నారు.

కానరాని సౌకర్యాలు..

వార్డులో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. తాగడానికి తాగునీరు లేదు. అలాగే మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా లేవు. భవనం కూడా శిథిలావస్థకు చేరుకుంది. మరుగుదొడ్లు లేకపోవడంతో రోగులు బహిరంగ మలవిసర్జనకు బయటకు వెళ్తున్నారు. రాత్రి వేళ అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. వార్డుకు సమీపంలో బహిరంగ మల విసర్జన చేయడం వల్ల దుర్వాసన వార్డుల్లోకి వస్తోంది. ఏళ్ల నాటి నుంచి కుష్టు రోగులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అయినప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారు. వార్డులో గచ్చు పగిలిపోయింది. డ్రెస్సింగ్ చేసిన దగ్గర పలక విరిగిపోయింది. ఇలా ఎక్కడ పడితే అక్కడ పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛభారత్ పేరుతో ప్రతి ఒక్కరూ మరుగు దొడ్డి నిర్మించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతున్నాయి. మరుగుదొడ్లు లేక కుష్టు రోగులు అవస్థలు పడుతున్నా మరుగుదొడ్లు కట్టించే ప్రయత్నం చేయకపోవడం విశేషం.

ప్రత్యక్ష నరకం..

కుష్టు రోగులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. కుష్టు రోగుల కాళ్లకు రాళ్లు తగలకూడదు. కాని బహిరంగ మలవిసర్జనకు వెళ్లినప్పుడు రాళ్లు కాళ్లకు తగలడంతో గాయాలు పెద్దవై తగ్గడం లేదని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..

మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. మలవిసర్జనకు బయటకు వెళ్తున్నాం. బయటకు వెళ్లినప్పుడు కాళ్లకు రాళ్లు గుచ్చుకోవడంతో దెబ్బలుగా మారుతున్నాయి. అయినా తప్పని పరిస్థితి.

సన్యాసి ,రోగి

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

క్షయ, హెచ్ఐవీ తాత్కాలిక చికిత్స కేంద్రంలో మరుగుదొడ్లు పనిచేయని మాట వాస్తవమే. గచ్చు కూడా పాడైంది. ఈ సమస్యను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి ఉన్నతాధికారులను సంప్రదించి పరిష్కారానికి కృషి చేస్తాం.

– డాక్టర్ రాణి, జిల్లా కుష్టు, హెచ్ఐవీ, క్షయ నివారణాధికారి